రామచంద్రమౌళి

# తత్వం



"సముద్రంలోకి మునిగిపోతున్న ఓడ"—దృశ్యం చిత్రించబడ్డ పటంకేసి తదేకంగా చూస్తూ నిలబడ్డాడు చలపతి.

అతని మనసు గర్జించే మేఘంలా అరిచి భళ్లున పగిలిపోయింది.

"భయంకరంగా సముద్రం కబళించి వేస్తోంది ... తనను తన లక్షలకొద్దీ రూపాయల అప్పు ముంచేస్తున్నట్టు."

"ఓడ మునిగిపోతోంది ... తను సమస్యల ఊబిలోకి కృంగిపోతున్నట్టు-"

"ఛీ, ఛీ ... జీవితం చిరిగిన

గాలిపటంలా తయారైంది... యిప్పుడిక తను కోలుకోవడం, తిరిగి బాగుపడడం జరిగేపనిలా లేదు."

"తను ఎంతో తెలివి గలవాడు. ఎంతో సమయస్ఫూర్తి గలవాడు. అందుకే తన చేతిలో ఉన్న వేల వ్యాపారాన్ని, లక్షల వ్యాపారంగా పెంపుజేయగలిగాడు. కాని... కాని ... యిప్పుడు తన ఎదిగిన యిద్దరు కొడుకులూ తనతోపాటు వ్యాపారంలోకి ప్రవేశించి చేతి కందినన్ని నోట్లకట్టలతో సుఖాల్లోకి పక్షుల్లా ఎగిరిపోవడం నేర్చుకుని ...ఒక్క రెండేళ్ళలోనే డబ్బంతా కర్పూరంలా హరించుకుపోయి ... దుకాణం కరి మింగిన వెలగపండులా బోలుగా మిగిలిపోయింది. చాణక్యుని లాంటి తను ఒట్టి చవటలా మిగిలిపోయి పరిస్థితులను సమీక్షించుకునేసరికి చేతులు పూర్తిగా కాలాయి నామరూపాల్లేకుండా. పట్టుకోడానికి ఆకు లెక్కడా కనబడలేదు. చుట్టూ రెండు లక్షల అప్పు కరువబోయే పాములా కనబడింది. దుకాణం విలువ లక్షరూపాయలైనా లేదు. బాకీలు రెండు లక్షలకు మించి ఉన్నాయి. యీ స్థితిలోనుండి బయట పడడం పద్మవ్యూహంలోనుండి అభిమన్యుడు బయటపడడం లాంటిది. కాని ఎలాగైనా బయటపడాలి. తప్పదు. తెలివి, మోసం, చాకచక్యం, వ్యాపార దక్షతలాంటి తనకున్న యీ లక్షణాలన్నింటినీ కలబోసి బురదలోనుండి ఎగరాల్సిన తారాజువ్వలా ఎగిరిపోవాలి ...కాని ఎలా...ఎలా?

చలపతి ముఖం నిండా చెమట వరదలా కారుతోంది. లోపల ఆలోచనలు అంటుకున్న పెట్రోలు పీపాల్లా మండుతున్నాయి.

ఎదురుగా గోడకున్న పటంవంక చూస్తున్న చలపతి—"ఏరా చలపతీ ఏదో ఆలోచనలో మునిగిపోయావ్" అన్న మందలింపుతో ఉలిక్కిపడ్డాడు.

ముందర నారాయణ.

నారాయణ తన మిత్రుడు, తన సహవ్యాపారి ... తనవలెనే బట్టల వ్యాపారం చేస్తున్నవాడు. దాదాపు తనంత తెలివిగలవాడు ... అక్కరలో ఓ యాభై వేలు అప్పిచ్చి తనను ఆదుకున్నవాడు—యిప్పుడు ఈ ఆపదలో తనకు సలహా యివ్వాల్సినవాడు.

నారాయణ నిశ్శబ్దంగా రెండు గ్లాసుల్లో విస్కీ వంచి సోడాకలిపి ఒకటి చలపతి దిక్కు జరిపి ... "కానీయ్" అన్నాడు.

నారాయణను బార్‌కు తీసుకెళ్ళి నాల్గు చుక్కలు తాగిస్తే తను అతనికివ్వాల్సిన అప్పు గురించి ఎక్కువ ఒత్తిడిరాకుండా ఉంటుంది — దొంగకే తాళా లిచ్చినట్టు నారాయణనే తన గురించి సలహా అడిగితే వాడి నోరు మూయించినట్టూ ఉంటుంది ... అన్న

ఉద్దేశ్యం చలపతినీ, నారాయణనూ బార్ కు లాక్కొచ్చి కూర్చోబెట్టింది.

"చీర్స్—" అన్నాడు నారాయణ గ్లాసును గలగల మనిపించి.

"చీర్స్."

నారాయణ సర్రున అగ్గిపుల్ల గీసి సిగరెట్టు వెలిగించుకుని గుండెల నిండా పొగను ఊపిరిలా పీల్చుకుని "ఊఁ... యిక చెప్పు చలపతీ నీ కథ... యివ్వాళ్టితో నీ సంగతి తేల్చేద్దాం" అన్నాడు.

"చెప్పేందు కేముందిరా. అంతా నీకు తెలిసిన సంగతే. నీ కివ్వాల్సిన యాభై వేల బాకీతో కలుపుకుని రెండు లక్షలకు మించిన అప్పు ముందర మూల్గుతోంది. నువ్వు నీ డబ్బును అడుగుతున్నట్లే అందరూ తమ తమ బాకీల నిమ్మని ఒత్తిడి చేస్తున్నారు. యింతదాకా ఏవేవో సాకులు చెప్తుతూ వచ్చాను. యిక ఎవడూ ఆగేట్టు లేడు. దుకాణం అమ్మి ఏదైనా చేద్దామంటే షాప్ వాల్యూ ఓ లక్ష ఉంటుందేమో ... షాప్ పోతే బ్రతుకు తెరువూ పోద్ది. పరువూ పోద్ది. ఏంజేయమంటావు నన్నిప్పుడు..."

ఓ గ్లాసైపోయింది.

రెండవ రౌండ్ వంచుతూ "నా బాకీ సంగతి అటుంచు చలపతీ. దాన్ని నీనుండి ఎప్పుడైనా నేను తీసుకుంటాను. మిగతా అప్పుల వాళ్ళ గురించి ఆలోచిద్దాం." అన్నాడు నారాయణ.

"........." చలపతి మాట్లాడ లేదు. నిండిన గ్లాసును గడగడా తాగేశాడు.

మళ్ళీ సీసాతో గ్లాసును నింపుతూ— "దీనికి ఒక్కటే పరిష్కారముంది చలపతీ... నువ్వు దాన్ని తు.చ. తప్పకుండా చేయదల్చుకుంటే చెప్తాను" అన్నాడు నారాయణ అతి మామూలుగా.

"ఊఁ...చెప్పు..."

గ్లాసులోనుండి మత్తు మనసులోకి ప్రవహిస్తోంది.


"స్నేహితునిగా మాత్రమే నేను నీకు సలహా యివ్వదలుచుకున్నాను—"

"ఊఁ..."

"జాగ్రత్తగా విను."

"ఊఁ..."

"యిప్పుడు యీ సీసా ఐపోయిం తర్వాత నా కారునూ, నా డ్రైవర్ నూ, నా దుకాణం తాళాలనూ యిస్తాను. నువ్వు నీ దుకాణాని కెళ్ళి ఓ నాల్గు ట్రిప్పుల్లో సగం స్టాక్ ను నా దుకాణంలో వేయించు. రేపు ఉదయం నీ దుకాణాన్ని తెరిచేందుకు బదులు తాళాలకు సీళ్లేసి— హాండ్సప్ చేసి దివాలా తీసినట్టు కోర్టులో యిన్ సాల్వెన్సీ పిటీషన్ను దాఖలా చెయ్యి. దాంతో ఓ నెలరోజుల్లో నీ అప్పులవాళ్ళంతా నీ దుకాణాన్ని తెరిపించి ఉన్నదాన్ని అమ్మించి




రూపాయి రావాల్సినవాడు పావలా తీసుకుని చచ్చినట్టు ఎవడి దారిన వాడు పోతాడు. అంతా సద్దుమణిగాక నా దుకాణంలోని నీ స్టాక్‌ను నువ్వు తీసుకుని మళ్ళీ పాతపాటే-"

"ఊఁ..." చలపతి తలలో ఘర్షణ జరుగుతోంది తీవ్రంగా.

ఏంజేయాలి ... ఏంజేయాలి ... నారాయణ చెప్పింది సబబుగానే ఉంది. కాని...

" ఏమంటావ్ – " అంటున్నాడు నారాయణ.

నారాయణ తన స్టాక్‌ను అతని దుకాణంలో వేసుకుని తన కీ రకంగా సహాయపడడం తన అదృష్టమే. దీంతో అప్పులవాళ్ళంతా ఆరిపోయి ... తన అప్పు కరిగిపోయి...తను ఊబిలో నుండి బయటపడి–

కాని తను చేస్తున్నది మోసంగదా–

ఊఁ...వ్యాపారమంటేనే మోసం... ఒకన్ని యింకొకడు మోసం చేయడం ...చిన్నచేపను పెద్దచేప భోంచేయడం ...యివన్నీ ప్రకృతి ధర్మాలు. సహజ లక్షణాలు. తను వట్టి నిమిత్తమాత్రుడు.

యిక యిప్పుడు తను తప్పకుండా నారాయణ చెప్పినట్టు చేయాల్సిందే... తప్పదు.

సీసా పూర్తయింది

లేచారు యిద్దరూ.

బయటకు రాగానే నారాయణ తన డ్రైవర్‌ను పిలిచి "సార్‌తో వెళ్ళి ఆయన చెప్పినట్టు చెయ్," అని చెప్పి ...చలపతికి తన దుకాణం తాళా లిచ్చి "బెస్టాఫ్ లక్" అని చెప్పి ఓ టాక్సీ ఎక్కి వెళ్ళిపోయాడు

చలపతి చేతిలోని నారాయణ దుకాణం తాళాలను భయంగా చూసి, ఖాళీ కాబోయే తన దుకాణాన్ని ఊహించుకుని బిక్కమొగమేసుకుని కారెక్కాడు.

* * *

చలపతిని అందరూ తిట్టుకున్నారు.

యిన్‌సాల్వెన్సీ పిటీషన్ నెగ్గి చలపతి దుకాణాన్ని బద్దలుకొట్టి తెరిచి చూసిన నాడు ఉన్న సరుకును అమ్మి పదివేలు అప్పిచ్చినవాడు రెండువేలు తీసుకుని ఏడుపు ముఖాలతో వెళ్ళిపోయారు.

అంతా సర్దుకుని — మామూలు వాతావరణం ఏర్పడ్డ తర్వాత—

ఓనాడు చలపతి అతిమామూలుగా నారాయణ దుకాణాని కొచ్చి—

"మరి ఆ నా స్టాక్ లెక్క చూద్దామా ..." అన్నాడు గుట్టలు, గుట్టలుగా పడి ఉన్న నారాయణ దుకాణంలోని తన బట్టల గుట్ట దిక్కు చూస్తూ.

చలపతికి నారాయణ దుకాణంలోని కళ్ళనిండా కనబడే స్టాక్‌ను చూస్తూంటే మనసు మండుతోంది.

"నువ్వు మాట్లాడే దేమిటి" అన్నాడు నారాయణ అకౌంట్ బుక్‌లో ఏదో రాసుకుంటూ.

"అదే ఆనాటి నా బట్టలు—"

"అవేవీ నాకు తెలియదు...నీ బట్టలు నా దుకాణంలో ఎందుకుంటాయి... నా దగ్గర నీ బట్టలు లేవుగాని నువ్వు రాసిచ్చిన ప్రోనోటుమాత్రం భద్రంగా ఉంది. చలపతీ నీకు నేను సలహా యిచ్చింది నిన్ను బాగుచేయడానిక్కాదు. నా డబ్బు నేను రాబట్టుకోడానికి. యిక నువ్వెళ్ళొచ్చు—" అన్నాడు.

"నారాయణా! యిది నీకు న్యాయం గాదు..."

"ఏది న్యాయం. నువ్వు నిర్దాక్షిణ్యంగా అప్పులోళ్ళకు ఎగనామం పెట్టడం మాత్రం న్యాయమా. చలపతీ మనం చేసేది వ్యాపారం. ఎవడికి తెలివి ఉంటుందో వాడిదే పైచేయి—"

చలపతి నారాయణవంక నిర్లిప్తంగా చూసి యోగిలా నవ్వి వెనుదిరిగాడు.

వెనుదిరిగి వస్తూండగా గుమ్మం దగ్గర నారాయణ కారు డ్రైవర్ కనిపించాడు నవ్వుతూ.

తను ఆ రోజు రాత్రి...నారాయణకు యివ్వాల్సిన బాకీ మందమే స్టాక్‌ను అతని దకాణానికి తరలించిన సంగతీ, లెక్కకు దొరకని నారాయణ దుకాణంలోని స్టాక్‌లో అతి ఖరీదైన పీతాంబరాలను తను లక్షరూపాయలదాకా ఆ రాత్రికి రాత్రి స్వాహాచేసి డ్రైవర్ సహాయంతో అమ్మి — అమాయకునిలా తను తప్పుకున్న సంగతి జ్ఞాపక మొచ్చి చలపతికి నవ్వొచ్చింది చిన్నగా.

ప్రపంచమంతా మోసాలమయం— అనుకుంటూ నడుస్తున్నాడు చలపతి ఒంటరిగా...ఎండలో.